## క్లుప్తంగా

### ఆడబిడ్డ వివాహానికి చేయూత

కడ్తాల్: మండల పరిధి మైసిగండికి చెందిన రమావత్ చెన్న నాయక్, హీరా దంపతుల కూతురు జయంతి వివాహానికి, బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్ నాయక్ చేయూత నందించారు. బుధవారం వివాహ వేడుకలో పాల్గొని రూ.10 వేలు అందజేశారు.

### వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

తలకొండపల్లి: 'స్వేరోస్ భీమ్ దీక్షా' ముగింపు సభను ఈ నెల 13న మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామని దళిత సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం మండల పరిధి మెదక్‌పల్లిలో దర్పుల శంకర్, మాజీ ఉప సర్పంచ్ నరేష్ గౌడ్ రజనీకాంత్‌లు దీక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వేరోస్ నెట్‌వర్క్... ఏటా ఒక ట్యాగ్ లైన్‌తో ఏకీభవించి సభ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. వ్యక్తిలోని భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, జ్ఞానవంతమైన సభకు ప్రతి ఒక్కరూ రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దర్పుల నవీన్, పాండు, సంతోష్, రాజు, రామస్వామి, అంజయ్య, గోపాల్, రమేష్, మల్లయ్య, వంశీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం తప్పనిసరి



లోయపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ అనిఫా తదితరులు

మంచాల: ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని లోయపల్లి సబ్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ అనిఫా సూచించారు. బుధవారం లోయపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషక అభియాన్ ర్యాలీలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, మూడు సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. పోషకాలు తీసుకున్నవారు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీశ్, ఆర్ఐ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ యాట భాస్కర్, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**22 వరకు వారోత్సవాలు**



పోషకాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ శబరి

కడ్తాల్: మండల పరిధి మక్తమాధారం గ్రామంలో బుధవారం పోషణ పక్షం వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి మాట్లాడుతూ, పోషణ పక్షం వారోత్సవాలు ఈ నెల 22 వరకు కొనసాగుతాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఆశ వర్కర్ అనిత, చిన్నారులు ఉన్నారు.

### కంటి వైద్య శిబిరం

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 250 మందికి వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో 50 మందికి కంటి ఆపరేషన్‌లు, 44 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, జమాల్‌ఖాన్, నరేశ్‌యాదవ్, లక్ష్మయ్య, జగన్ రెడ్డి, దర్శన్, కృష్ణ, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ అధికారులకు సత్కారం

షాద్‌నగర్: శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేసినందుకుగాను హిందు వాహిని సంస్థ నాయకులు బుధవారం ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. శోభాయాత్రకు గట్టి బందోబస్తు కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా శోభాయాత్ర విజయవంతం చేసినందుకు నాయకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ, సీఐని నాయకులు సత్కరించి మెమొంటోలు అందజేశారు. హిందువాహిని నాయకులు చెట్ల వెంకటేశ్, గుడాల రమేశ్, మహేశ్, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, శివశంకర్, రఘు, శ్రీనాథ్, అజయ్, శ్రీను, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లర్లకే పరిమితం



తక్కళ్లపల్లిలో పిల్లర్ల దశలో నిర్మాణం

యాచారం: ఇందిరమ్మ ఇళ్లు పిల్లర్లకే పరిమితమయ్యాయి. యాచారం మండలం తక్కళ్లపల్లి గ్రామాన్ని పథకం కింద పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. అర్హులైన 83 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా 14 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. అందులో నలుగురు పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టగా, మిగతా 10 మంది గుంతలు తీసి వదిలేశారు. పిల్లర్ల వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు రూ. 50 వేల నుంచి రూ.లక్షకు పైగానే ఖర్చు చేశారు. పథకం కింద ఇస్తామన్న రూ.5 లక్షల నిధుల్లో పైసా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

### దరఖాస్తులు 692.. అర్హులు 71



లింగంపల్లిలో బేస్మెంట్ వరకు పూర్తయిన ఇల్లు

మంచాల: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండల పరిధి లింగంపల్లి గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ గ్రామంగా తీసుకుంది. ఇదే గ్రామంలో ఇళ్ల కోసం 692 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 71 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో 59 మంది ఇళ్ల నిర్మాణ పనుల కోసం(మార్కింగ్) ముగ్గు పోయాలని ఉత్తర్వులు రాగా.. 22 ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఓ లబ్ధిదారుడు బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశారు. మిగతా ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో ఇల్లు కట్టుకోవడానికి స్థలం ఉన్న అర్హులకే ఇళ్లు మంజూరు చేశారు.

# నిధులు రాక.. నిర్మాణం సాగక

**నత్తనడకన 'ఇందిరమ్మ' పథకం**

- పిల్లర్లు, బేస్మెంట్లకే పరిమితం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- నెరవేరని పేదోడి సొంతింటి కల
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

**పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రజాపాలన చేపట్టింది. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. హడావిడిగా లబ్ధిదారులను సైతం ఎంపిక చేసింది. చేస్తోంది. కానీ.. గడిచిన ఏడాది కాలంగా ఏ ఒక్కరికీ డబ్బులు ఇవ్వలేదు. అయినప్పటికీ కొందరు అర్హులు అప్పుచేసి బేస్మెంట్, పిల్లర్ల వరకు నిర్మించారు. అయినా నేటికీ నయాపైస రాలేదని, డబ్బులు ఇస్తేనే ఇంటిని కట్టుకునే పరిస్థితి అని పలువురు వాపోతున్నారు.**



కప్పపహాడ్ గ్రామంలో పిల్లర్ల దశలో నిర్మాణం

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నత్తనడక కొనసాగుతోంది. తొలుత హడావుడి చేసినా.. క్రమంగా నెమ్మదించింది. స్కీంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ గ్రామంలో 495 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో 94 మందిని అర్హులుగా గుర్తించారు. జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రోజే.. పట్నంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కప్పపహాడ్‌లో పథానికి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అర్హుల్లో 34 మంది ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. పదికి పైగా పుట్టింగ్‌లు పోసి, పిల్లర్లు వేశారు. బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారు ఉన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ ఒక్కరికీ డబ్బులు ఇవ్వలేదు. లబ్ధిదారుల సొంత డబ్బుతో నిర్మాణం చేపట్టారు. కరువులో అప్పు చేసి ఇంటి నిర్మాణం మొదలు పెట్టామని, ఇప్పటి వరకు నయాపైస అందలేదని పలువురు పేర్కొంటున్నారు. డబ్బులు త్వరగా ఇవ్వాలని కోరుతున్నారు.

### పునాది, బేస్మెంట్‌తో సరి



కొండ్రిగానిబోడ్‌తండాలో బేస్మెంట్‌తో ఆగిన నిర్మాణం

కడ్తాల్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండల పరిధి కొండ్రిగాన్‌బోడ్‌తండాలో రెండు నెలల క్రితం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలో 26 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 11 మంది లబ్ధిదారులు బేస్మెంట్ లెవల్, మరో నలుగురు గుంతలు తీశారు. మిగతా వారు పనులు ప్రారంభించలేదు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. అప్పు చేసి బేస్మెంట్ వరకు నిర్మించామని, అయినా ఎలాంటి డబ్బులు అందలేదని పేర్కొంటున్నారు. మొదటి విడత బిల్లు అందజేస్తే నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు.

### 12వేల ఇళ్లకు..

తలకొండపల్లి: మండల పరిధి 32 గ్రామాల పరిధిలో 12000 ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు అందాయి. అధికారులు పరిశీలించారు. అయినా ఒక్కరికీ ఇంటిని మంజూరు చేయలేదు. పైలెట్ ప్రాజెక్టు కింద ఖానాపూర్‌ను ఎంపిక చేశారు. 70 మందిని అర్హులుగా గుర్తించారు. అర్హుల్లో కొందరు ఇప్పటికే స్లాబ్ వరకు నిర్మాణం పూర్తి చేశారు. అయినా ఎవరికి డబ్బులు రాలేదు. ప్రభుత్వ హామీతో అప్పు చేసి, ఇంటి నిర్మాణం మొదలు పెట్టామని, త్వరగా డబ్బులు మంజూరు నిర్మాణం పూర్తి చేసుకుంటామని పలువురు తెలిపారు.

### త్వరగా బిల్లు ఇవ్వాలి



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ మాత్రం డబ్బులు చెల్లించలేదు. అయినా అప్పు చేసి బెస్మెంట్ వరకు నిర్మించాను. త్వరగా డబ్బులు ఇస్తే, మిగతా నిర్మాణ పనులు మొదలు పెడతాను. ప్రభుత్వం స్పందించాలి.

– చలిమిల్ల జంగారెడ్డి, లింగంపల్లి, మంచాల

### నయా పైస రాలేదు



దళితులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు ఇస్తామని ప్రకటించింది. మాకు ఇల్లు లేదు. దరఖాస్తు చేసుకుంటే వచ్చింది. ఆ ధీమాతో బేస్మెంట్ వరకు పూర్తి చేసి, పిల్లర్లు కూడా పోశాము. ఇప్పటికే రూ.3 లక్షలు ఖర్చు అయింది. కాని ప్రభుత్వం నుంచి నయా పైస రాలేదు. అధికారులు రాలేదు. చూడలేదు. బిల్లు వస్తేనే పని ప్రారంభిస్తాం. లేకుంటే అంతే.

– చెరువెంక సురేష్, కప్పపహాడ్, ఇబ్రహీంపట్నం రూరల్

### బేస్మెంట్ వరకు పూర్తి..



ఇందిరమ్మ ఇళ్లు మంజూరయింది. రెండు నెలలుగా రూ.లక్షకు పైగా ఖర్చు చేసి బేస్మెంట్ వరకు ఇంటిని నిర్మించాం. పైసలు లేక పని ఆగిపోయింది. ప్రభుత్వం మొదటి విడత బిల్లు మంజూరు చేస్తే, నిర్మాణ పనులు ముందుకు సాగుతాయి.

– సవిత, కొండ్రిగానిబోడ్‌తండా, కడ్తాల్

### నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఈ నెల 10న కాంగ్రెస్ కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమం గురించి సమావేశంలో చర్చిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి నియోజకవర్గ పరిధి పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరమని పీసీసీ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి, పీసీసీ మాజీ సభ్యుడు పాశం లక్ష్మీపతిగౌడ్‌లు పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లి ప్రాంతాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

**మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్**

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, నాయకులు కుమార్‌గౌడ్, మంకాల శ్రీశైలం, శివకుమార్, వీరేందర్, సాములయ్య, శ్రీనివాస్, భాస్కర్, నరేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**సన్నబియ్యం పంపిణీ**

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# తహసీల్దార్‌కు రైతు కృతజ్ఞతలు



రైతుకు పాసుబుక్‌ను అందజేస్తున్న తహసీల్దార్

కడ్తాల్: ఒక గ్రామంలో ఒకే పేరుగల ఇద్దరు రైతులు ఉన్నారు. అందులో ఒకరి ధరణిలోంచి తొలగించాల్సిన భూమిని మరో రైతు దరణిలో నుంచి తొలగించారు. దీంతో బాధిత రైతు మూడేళ్లుగా సమస్య పరిష్కారం కోసం తిరగగా.. తాజాగా తహసీల్దార్ సమస్యను పరిష్కరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి సాలార్‌పూర్ గ్రామంలో నేనావత్ ఘాంస్య అనే పేరు కలిగిన ఇద్దరు రైతులు ఉన్నారు. దీంతో 2022లో పెండింగ్ మ్యుటేషన్ ఆప్షన్ ద్వారా ధరణి సర్వే నంబర్ 86లో నుంచి 20 గుంటల భూమిని ఒకరి నుంచి తొలగించాల్సింది పోయి.. మరొకరిది తొలగించారు. దీంతో బాధిత రైతు ఘాంస్య.. సమస్య పరిష్కారం కోసం మూడు సంవత్సరాలుగా తిరిగాడు. ఈ క్రమంలో జరిగిన విషయాన్ని ఇటీవల తహసీల్దార్ ముంతాజ్‌కు వివరించాడు. తన భూమిని ధరణిలో నమోదు చేయించాలని కోరాడు. స్పందించిన తహసీల్దార్ దస్త్రాలను పరిశీలించి, ధరణిలో తప్పుగా నమోదయిన విస్తీర్ణం తొలగించారు. అనంతరం కలెక్టర్ ఆమోదం మేరకు సంబంధిత ఘాంస్య నాయక్ భూమిని ధరణిలో నమోదు చేశారు. అనంతరం బుధవారం రైతుకు తహసీల్దార్ పాస్‌బుక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు బాధిత రైతు కృతజ్ఞతలు తెలిపారు.

# వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

**ఎంపీడీఓ కుసుమమాధురి**



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుసుమమాధురి

ఆమనగల్లు: వేసవి నేపథ్యంలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కుసుమ మాధురి సూచించారు. బుధవారం మండల పరిధి పోలెపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. గ్రామంలోని నర్సరీ, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కూలీలకు బిల్లులు ఎప్పటికప్పుడు రికార్డు చేసి ఇస్తున్నామని, సాంకేతిక కారణాలతో ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులకు బేస్మెంట్ లెవెల్ వరకు పనులు పూర్తి చేసుకుంటే, మొదటి బిల్లులు కోసం.. ఉన్నతాధికారులకు సంబంధిత వివరాలను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దేవేందర్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

### ఆధ్యాత్మికతతో ప్రశాంతత



మాట్లాడుతున్న రాజ్‌దేశ్‌పాండే గురుస్వామి

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే గురుస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప దేవాలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో నీ గానమే నా ప్రాణం పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని దేవాలయంలో ఏర్పాటు చేసిన 18 మెట్ల మహాపడి పూజచేశారు. అనంతరం నీ గానమే నా ప్రాణం పాట ఆవిష్కరించారు.

### బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



గౌరారంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేకే శ్రీనివాస్ అన్నారు. మండల పరిధి శెట్టిపల్లి, గౌరారం, ఆకుతోటపల్లి, సీతారాంనగర్‌తండా, చింతలపల్లి, మంగళపల్లి గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్టీ కార్యకర్తలు గడపగడపకు తీసుకెళ్లి, ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోరటి నర్సింహ, లక్ష్మణ్‌రావ్, నరేశ్‌నాయక్, మల్లేశ్, సీతారామారావ్, దేవ్‌సింగ్, శేఖర్‌రెడ్డి, పెద్దయ్యయాదవ్, యాదయ్య, మహేశ్, తిరుపతి, శివ, జైపాల్‌రెడ్డి, అంజయ్య, బాలరాజు, కొండల్‌రెడ్డి, దయాకర్ రావ్, రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లి తండాలో కాషాయ జెండాను.. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి ఆవిష్కరించారు.

### గ్రామాల అభివృద్ధికి కృషి

నందిగామ: గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో జెడ్పీ నిధులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేవల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు రాములు, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణగౌడ్, సుమన్, జంగయ్య, వెంకట్‌రెడ్డి, లింగం, సురేశ్, దామోదర్ రెడ్డి, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేతలు



తుర్కయంజాల్: సాగర్ రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# 'బండ'భారం దించాలి

- పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి
- సీపీఎం నాయకుల డిమాండ్
- మోదీ దిష్టి బొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామెల్ డిమాండ్ చేశారు. గ్యాస్ ధర తగ్గించాలని బుధవారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్లతో నిరసన తెలిపారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సామెల్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు తగ్గుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం పెట్రోల్, గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. పెరిగిన నిత్యావసర సరుకులు, వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో తాజాగా గ్యాస్ ధరను రూ.50 పెంచడం మోసం చేయడమేనని పేర్కొన్నారు. గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుగ్గరాములు, జంగయ్య, జగన్, ఎల్లేష్, వెంకటేశ్, నర్సింహ్మా, ప్రభుదాసు, శంకర్, స్వామిలు పాల్గొన్నారు.

**క్రూడాయిల్ ధరలు తగ్గినా..**

తుర్కయంజాల్: పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాగర్ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. క్రూడాయిల్ ధరలు వరుసగా తగ్గుతున్నా.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను పెంచడం దారుణమని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సిలిండర్ ధర తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భాస్కర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

### ధరల పెంపుతో పేదలకు ఆర్థిక భారం

మాడ్గుల: కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచి సామాన్యులకు దగా చేసిందని విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తరచూ సిలిండర్ల ధరలను పెంచుతుందని పేర్కొన్నారు. దీంతో సామాన్యులపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ఎన్ఎస్‌యూఐ సేవలు ప్రశంసనీయం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎస్‌యూఐ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు గంట ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఏడాదిలోపే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని పేర్కొన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ఏ విధంగా పనిచేశారో, రానున్న స్థానిక ఎన్నికల్లో అదే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జహంగీర్‌అలీ, రాజేశ్, భానుకిరణ్, సత్యం, ఇమ్రాన్, హీరాసింగ్, రవి, తులసీరాం, మల్లేశ్, శ్రీకాంత్, విజయ్, పవన్, జశ్వంత్, దినేశ్ తదితరులు ఉన్నారు.